www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 29 అక్టోబర్ 2024
5
పశ్చిమ గోదావరి



విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి


4న జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన

భీమవరం: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు పిల్లి సుబ్బారావు డిమాండ్ చేశారు. నవంబర్ 4వ తేదీన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసనలు జయప్రదం చేయాలని పిలుపునిచారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సంఘం యూనియన్ నాయకులు గోపాల్ అధ్యక్షతన సంఘం సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా నాయకులు ఖాదర్, సుబ్బారావు మాట్లాడారు. విఆర్ఎల సమస్యలు గత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా దృష్టి పెట్టాలన్నారు. చాలీచాలని వేతనాలతో, పని భారంతో విఆర్ఎలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు, నల్ల అబ్బాయి పాల్గొన్నారు.

నేవీ ఆయుధ డిపో.. ఇక్కడొద్దు

'నేవీ ఆయుధ డిపో ఇక్కడ పెట్టొద్దు.. మమ్మల్ని ఇలా బతకనీయండి. ఇప్పటికే పలు ప్రాజెక్టుల పేరుతో అనేక గిరిజన కుటుంబాలు చిద్రమయ్యాయి. గతంలో రెండుసార్లు వ్యతిరేకించడంతోపాటు గ్రామసభ తీర్మానం చేసినా, మళ్లీ గ్రామసభ నిర్వహించడం ఏమిటీ అంటూ జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ సోమవారం జరిగిన గ్రామసభలో తీర్మానం చేశారు. గెలవక ముందు ఒకలా.. గెలిచిన తర్వాత మరోలా అన్నట్లు తాము గెలిపించిన ఎంపీ, ఎంఎల్ఎలే తమకు వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ అక్కడికి వచ్చిన గిరిజనులంతా లోలోన ఆవేదన పడిన పరిస్థితులు కన్పించాయి.

- వంకావారిగూడెం గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం
- నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా నినదించిన గిరిజనులు
- పలు ప్రాజెక్టుల పేరుతో ఏజెన్సీని చిద్రం చేశారంటూ ఆవేదన
- గిరిజనులకు నచ్చజెప్పేందుకు యత్నించిన ఎంఎల్ఎ చిర్రి బాలరాజు
- పదేపదే గ్రామసభలు నిర్వహించడంపై గిరిజనుల తీవ్ర అసహనం
- ఎంపీ, ఎంఎల్ఎలు తమకు వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ లోలోన ఆవేదన



ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జీలుగుమిల్లి

నేవీ ఆయుధ సామగ్రి డిపో తమ ఏజెన్సీ ప్రాంతంలో పెట్టేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని వంకావారిగూడెం పరిధిలోని ఐదుగ్రామాల ప్రజలు స్పష్టం చేశారు. గతంలోనే తీర్మానాలు చేసినా ఎందుకు మళ్లీమళ్లీ గ్రామసభలు నిర్వహిస్తున్నారంటూ గిరిజనులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామస్తులంతా ముక్తకంఠంతో ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ సోమవారం జరిగిన గ్రామసభలో మరోసారి తీర్మానం చేయడం సంచలనం సృష్టించింది.

జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు నిమిత్తం భూసేకరణకు సంబంధించి ఇన్‌ఛార్జి తహశీల్దార్ సందీప్ అధ్వర్యంలో సర్పంచి కుంజా పార్వతి అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. దీనికి పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలో రెండుసార్లు గ్రామ సభలు నిర్వహించారని, అప్పుడు ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశారని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా వినతి ఇవ్వగా, గ్రామసభ ఆమోదం లేకుండా ఎటువంటి కార్యక్రమం జరగదని చెప్పారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామసభ అంటూ మళ్లీ రావడం ఏమిటని నిలదీశారు. దీనిపై ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటుపై మీకున్న అనుమానాలు తెలపాలని కోరారు. దీంతో గిరిజనులు తమ ఆవేదనను, ఇబ్బందులను ఎంఎల్ఎకు వివరించారు. నేవీ ఆయుధ డిపో ఏర్పాటైతే ఏజెన్సీ అనేది కనుమరుగవుతుందన్నారు. గతంలో పోలవరం ప్రాజెక్ట్ పేరుతో పలు గిరిజన గ్రామాలను ఖాళీ చేయించారని తెలిపారు. జల్లేరు, పోగొండ జలాశయాల కోసం గిరిజనులు భూమి త్యాగాలు చేశారని గుర్తు చేశారు. అప్పట్లో ఇంటికో ఉద్యోగం, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వాలు, అధికారులు మాటలు చెప్పారని, భూములు సేకరించాక గిరిజనులను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు అంటూ తమ భూముల్ని లాక్కుని, ఇక్కడ గిరిజనులను తరిమి కొట్టడానికి సిద్ధమయ్యారని వాపోయారు. ఆయుధ డిపో ఏర్పాటైతే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు లేకుండా పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు అనేది కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉందన్నారు. మీ సందేహాలను రాత పూర్వకంగా ఇస్తే వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కేంద్రానికి తెలిసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుంజా పార్వతి, గిరిజన సంఘాల నాయకులు తెల్లం దుర్గారావు, మడకం వెంకటేశ్వరరావు, మడకం శేషగిరి, కుంజా రాముడు, సంకురుడు, పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు పాల్గొనగా పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పెద్దసంఖ్యలో మొహరించారు.

గిరిజనులకు వ్యతిరేకంగా ప్రజాప్రతినిధుల తీరు

ఎస్‌టి రిజర్వుడు కోటాలో పోలవరం నియోజకవర్గం ఉంది. దీంతో ఇక్కడ గిరిజన నేతలే ఎంఎల్ఎలుగా గెలుపొందుతున్నారు. ఎన్నికల్లో గెలవకు ముందు ఒకలా.. గెలిచిన తర్వాత మరోలా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమలో ఒకరిగా, తాము గెలిపించుకున్న ఎంఎల్ఎలు తమకు అనుకూలంగా కాకుండా కార్పొరేట్లకు, బడా భూస్వాములకు అనుకూలంగా పని చేస్తున్నారని వాపోతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదు. పరిహారంగాని, ఇళ్లకు ఇళ్లుగాని, యువతకు పరిహారంగాని, భూమికి..భూమి వంటి అనేక సమస్యలు అలానే ఉన్నాయి. వీటిపై గిరిజనులకు అనుకూలంగా ఎంఎల్ఎలు మాట్లాడిన పరిస్థితులు పెద్దగా లేవు. తమ ఓట్లతో గెలిచిన ఎంఎల్ఎలు తమ మనోభీష్టానికి అనుగుణంగా కాకుండా పాలకులు ఏం చెబితే అదే అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎల్‌టిఆర్ భూముల విషయంలోనూ గిరిజనులకు అండగా నిలవకుండా భూస్వాములకు ప్రజాప్రతినిధులు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో ఆయుధ డిపో ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాల్లోనూ అక్కడి ప్రజలకు అనుకూలంగా కాకుండా ఎంపీ, ఎంఎల్ఎ వ్యవహరిస్తున్నారనే చర్చ సర్వత్రా సాగుతోంది. అభివృద్ధి ముసుగులో గిరిజనులకు అన్యాయం జరుగుతున్నా తాము గెలిపించిన ప్రజాప్రతినిధులు తమకు అండగా నిలబడటం లేదనే అభిప్రాయం గిరిజనుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకూ ప్రాజెక్టుల పేరుతో గిరిజనులకు న్యాయం జరగకపోయినా ఇప్పుడు కొత్తగా ఏదో చేస్తామన్నట్లు చెప్పడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము ఓట్లు వేసి గెలిపించిన ఎంపీ, ఎంఎల్ఎలు తమ ఆవేదనను అర్థం చేసుకుని తమకు అండగా నిలబడాలని గిరిజనులు కోరుతున్నారు.

మళ్లీ ఫిర్యాదులు రాకుండా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి


ప్రజల నుంచి సమస్యలు వెంటనే కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మళ్లీ మళ్లీ ఫిర్యాదులు రాకుండా ప్రజలు సమర్పించే వినతులకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 174 వినతులను స్వీకరించారు. ముందుగా గత వారం ప్రజలు సమర్పించిన వినతులపై అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. నిర్ణీత కాలంలో ఫిర్యాదులను పరిష్కరించాలని, మళ్లీమళ్లీ రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అవసరమైతే జిల్లా స్థాయి అధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడాలని, పూర్వాపరాలు తెలుసుకొని సంతృప్తికరంగా పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

సేవ చేయాలని మనసుంటే వయసు అడ్డు కాదు

సేవ చేయాలన్న మనసు ఉంటే వయసు అడ్డుకాదని, ఎనిమిది పదుల వయసులో ఉదయ్యవర్ తిరువది ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉదయ్యవర్ తిరువది ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు జిల్లా కలెక్టర్ నాగరాణిని కలిసి ట్రస్ట్ కార్యక్రమాలను వివరించారు. 'భారత అభ్యుత్తాన మంగళ యాత్ర' పేరిట ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశం వరకూ ఉన్న జిల్లాల్లో పర్యటిస్తూ ఆయా జిల్లాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ట్రస్టు ద్వారా సహాయం చేయాలనే లక్ష్యంతో ఉన్నామని ట్రస్ట్ సభ్యులు వివరించారు. జిల్లాలో మీ దష్టిలో ఉన్న వాస్తవంగా ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులకు విద్య, వైద్యం, హాస్పటల్స్‌లో మౌలిక సదుపాయాలు, తల సేమియా బాధితులకు రక్త మార్పిడి, వ్యక్తిగత ఇబ్బందులు, తదితర విషయాలలో తమ ట్రస్టు ద్వారా సహాయం చేయడానికి ముందున్నామన్నారు. ట్రస్ట్‌కు ఎటువంటి విరాళాలు సేకరించడం లేదని, బయట వారు విరాళాలు ఇచ్చినా తీసుకోబోమని తెలిపారు. ట్రస్టులో సభ్యులుగా ఉన్న సుమారు 500 మంది అందించే నగదును, సహాయం కోరిన వారికి అందజేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మీ అందర్నీ చూస్తుంటే 80 ఏళ్ల వయసు పైబడి ఉన్నారని, వివిధ రాష్ట్రాల నుండి సభ్యులుగా ఉండడం, ఈ వయసులో వివిధ వాతావరణలను తట్టుకుంటూ భారతదేశం మొత్తం తిరిగి సహాయం చేయాలనే మీ సంకల్పానికి జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు. అనంతరం 14 మంది బృందం సభ్యులను కలెక్టర్ సత్కరించారు.

పోరాట యోధుడు కడెమ్మ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పోరాటయోధుడు చింతపల్లి కడెమ్మ అని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జత్తుగ నర్సింహమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని అరట్లకట్ట గ్రామంలో చింతపల్లి కడెమ్మ 12వ వర్ధంతి సభ బొంతు శ్రీనివాసరావు అధ్యక్షతన కడెమ్మ స్తూపం వద్ద జరిగింది. కడెమ్మ స్తూపంపై సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు జెండాను ఆవిష్కరించారు. అనంతరం బొంతు శ్రీనివాసరావు అధ్యకతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన జత్తుగ నర్సింహమూర్తి మాట్లాడుతూ వృత్తి రక్షణ కోసం కడెమ్మ అనేక పోరాటాలు చేశారని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల నేడు కల్లుగీత వృత్తి తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోందన్నారు. బెల్ట్ షాపులు ఊరూరా పుట్ట గొడుగుల్లా వెలిశాయని తెలిపారు. తక్షణం బెల్టుషాపులను అరికట్టాలన్నారు. అక్రమ మద్యం, బెల్టుషాపులపై రానున్న రోజుల్లో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కల్లులో ఉపాధి కల్పించే విధంగా తక్షణం పాలసీ రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి చింతపల్లి లక్ష్మీకుమారి, చింతపల్లి శ్రీనివాస్, కడలి బాలాజీ, చింతపల్లి నరసింహ, బండి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

11న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఆశా వర్కర్స్ సమస్యలపై ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతపల్లి లక్ష్మి డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని కోరుతూ నవంబర్ 11న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో లక్ష్మి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆశా వర్కర్ ఆందోళన సందర్భంగా అంగీకరించిన సమస్యలను ఇప్పటివరకూ ఉత్తర్వులు విడుదల చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశా వర్కర్ల సమావేశాల్లో పాల్గొని సమస్యలు పరిష్కరిస్తామని అనేక హామీలు ఇచ్చిందని, ఇప్పటివరకూ నెరవేర్చేందుకు ఎటువంటి ప్రయత్నమూ చేయకపోవడం సరికాదని విమర్శించారు. మంగళవారం ఆశా డే సందర్భంగా ప్రతి పిహెచ్‌సి వద్దా ధర్నాలు చేసి వినతిపత్రాలు అందించాలన్నారు. నవంబర్ 11వ తేదీన కలెక్టరేట్ల ఎదుట ప్రదర్శన, ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు నాయకులు కె.రాయ్ మాట్లాడుతూ చిరుద్యోగుల పట్ల ప్రజాప్రతినిధులు వేధింపులు తొలగింపులకు గురి చేస్తున్నారని, వీటిని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్, ఐకెపి, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ పంచాయతీ, మున్సిపల్ వంటి అనేక రంగాల్లో ప్రతి నెలా జీతాలు ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పు పట్టారు. ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీ నాటికి జీతం విడుదల చేసేందుకు చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో అన్ని సంఘాలు ఐక్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. తొలుత సమావేశంలో ఇటీవల మరణించిన ఆశా వర్కర్లకు, సిఐటియు నాయకులకు సంతాపం తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే డిసెంబర్లో అవసరమైతే సమ్మెకు కూడా సిద్ధం కావాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో జిల్లా నాయకులు లారెన్స్ కుమారి, బేగం, ఆదిలక్ష్మి, పద్మ, జయంతి, ప్రశాంతి, సాయి లక్ష్మి, శ్యామల, అరటికట్ల లక్ష్మి పాల్గొన్నారు.

కార్మికుల సంఖ్య పెంచి పని భారం తగ్గించాలి

మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాల్లో సిఐటియు నేతలు



భీమవరంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న నేతలు



తణుకులో..

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం మున్సిపాల్టీలో కార్మికుల సంఖ్య పెంచి పని భారం తగ్గించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ 36 అమలు చేసి పనిముట్లు అందించాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో భీమవరం మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తవుతున్నా మున్సిపల్ కార్మికులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. భీమవరం మున్సిపాల్టీలో పర్మినెంట్ కార్మికుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోందని వారి స్థానంలో కొత్త కార్మికులను నియమించాలని డిమాండ్‌చేశారు. జిల్లా కేంద్రం వల్ల పని భారం మరింత పెరిగిందని, దానికి అనుగుణంగా కార్మికులను పెంచే చర్యలను అధికారులు తీసుకోవడం లేదని విమర్శించారు. డివిజన్లో హెల్త్ కిట్స్ ఏర్పాటు చేయాలని, ఇప్పటికే కార్మికులు అనారోగ్యాలపాలై ఇబ్బందులు పడుతున్నారు తెలిపారు. యూనియన్ అధ్యక్షులు నీలాపు రాజు మాట్లాడుతూ సమ్మె కాలం ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని డిపార్ట్మెంట్లో ఖాళీలు సంఖ్య భర్తీ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించలేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. యూనియన్ నాయకులు బి.వరలక్ష్మి, నీలాపు రాజు, భాను, మోహన్జ, యరాజు,నాని, ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు : కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్, క్లాప్ కార్మికులకు రూ.24,500 వేతనం ఇవ్వాలని, చట్టప్రకారం ఉన్న సెలవులు ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లు వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో వైసిపి ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఎన్నో ఆశలతో కూటమికి కార్మికులు మద్దత్తు ఇచ్చారని గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయాలని లేకుంటే భవిష్యత్తులో సమ్మెకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఇంజినీరింగ్ సెక్షన్ యూనియన్ అధ్యక్షులు ఉండ్రాజవరం శ్రీను మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి ఎంటివివి గణేష్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి చెత్త సేకరణ వాహనాలు నడుపుతున్నామని, తమకు నేటికీ కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. మున్సిపల్ యూనియన్ కార్యదర్శి ఎన్.ఆదినారాయణబాబు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే శరణ్యమన్నారు. సిఐటియు జిల్లా నాయకులు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, అర్జీ కృష్ణబాబు, మందులయ్య, రాణి, అయ్యప్ప, జి.విజయకుమార్, శ్రీదేవి, పడాల దానం, నాగబాబు, తాతారావు, ఆదినారాయణ, కేశవరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని భారతి ఉద్యోగ విరమణ సందర్భంగా

నెంబర్ వన్ టీచర్ భారతి



యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు

పాలకోడేరు: గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తికి మరింత గౌరవం తీసుకొచ్చిన ఉపాధ్యాయురాలు ఎవరైనా ఉన్నారంటే అది భారతి ఒక్కరే. నెంబర్ వన్ టీచర్. పేరు పెట్టడానికి ఎవరు సరిపోరు. విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాదు, సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటారు ఆమె. కరోనా కష్టకాలంలో ఎంతోమందికి సహాయ సహకారాలు అందించారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం తలపెట్టినా భారతి భాగస్వామ్యం ఎక్కువగానే ఉంటుంది. ప్రస్తుతం యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్‌గా పనిచేస్తున్న ఆమె కార్యకర్తగా చురుకైన పాత్ర పోషిస్తున్నారు.


యుటిఎఫ్ అభివృద్ధికి భారతి కృషి ఎనలేనిది



యుటిఎఫ్ మండల అధ్యక్షులు పేరిచర్ల వెంకటరమణరాజు

పాలకోడేరు : పాలకోడేరు మండలంలో యుటిఎఫ్ అభివృద్ధికి భారతి కృషి ఎనలేనిది. మంచి యుటిఎఫ్ కార్యకర్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. వినూత్న రీతిలో విద్యార్థులకు విద్యాబోధన చేయడం ఆమె గొప్పతనం. సమాజం పట్ల భారతికి ఎంతో గౌరవం. ఉపాధ్యాయులందరికీ భారతి ఆదర్శప్రాయులు. విద్యారంగంలో ఆమె అందించిన సేవలు ఎనలేనివి.

నిబద్ధత కలిగిన టీచర్ భారతి



యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కౌరు త్రిమూర్తులు

పాలకోడేరు: పాలకోడేరులో భారతి సుమారు 30 ఏళ్లపాటు ఉపాధ్యాయులుగా పని చేశారు. మంచి నిబద్ధత కలిగిన టీచర్. కరోనా సమయంలో ఆమె చేసిన సేవలు ఎనలేనివి. ఎన్నో ఏళ్ల నుంచి సొంత డబ్బు వెచ్చించి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తూ ఉంటారు. యుటిఎఫ్ కార్యకర్తగా ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యలపై అనేక ఆందోళనల్లో పాల్గొని పోరాడారు.

పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి



పాలకోడేరు జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.మహేష్‌బాబు

పాలకోడేరు :ఎనిమిదేళ్ల నుంచి భారతి మా హైస్కూల్లో సోషల్ టీచర్‌గా పని చేస్తున్నారు. మంచి సబ్జెక్టు టీచరే కాదు దాత కూడా. పాఠశాల అభివృద్ధికి ఆమె ఎనలేని కృషి చేశారు. దాతలను సమకూర్చి, విరాళాలు సేకరించడంలో మంచి చొరవ ఆమె సొంతం. గ్రామంలోని నాలుగు ప్రాథమిక పాఠశాలల్లో పని చేశారు. అక్కడ చదివిన విద్యార్థులు ప్రస్తుతం హైస్కూల్లో చదువుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కొంతమంది భారతి టీచర్ దగ్గర చదువుకున్నారు. విద్యాభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి, సామాజికపరంగా భారతి టీచర్ అందించిన సేవల గురించి ఎంత చెప్పినా తక్కువే.

భారతితో కలిసి పని చేయడం మా అదృష్టం



గాతల జేమ్స్, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు

సుదీర్ఘ కాలం ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసి ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది, అందరి మన్ననలు పొందడం అభినందనీయం. భారతితో కలిసి పనిచేసే భాగ్యం కలగడం మా అదృష్టం.

కమీషన్ తగ్గించొద్దు

ఎల్ఐసి ఏజెంట్ల నిరసనలు



తాడేపల్లిగూడెంలో నిరసన తెలుపుతునన ఏజెంట్లు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎల్ఐసి ఏజెంట్ల కమీషన్ తగ్గించాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. స్థానిక జీవిత బీమా కార్యాలయం వద్ద ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పొత్తూరి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్ల జీవనాధారమైన కమీషన్‌ను తగ్గించటం అన్యాయమనాను. ఈ నిర్ణయాన్ని ఎల్ఐసి యాజమాన్యం వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కొత్త పాలసీలపై ప్రీమియం తగ్గించాలని, బోనస్ పెంచాలని, జిఎస్‌టి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ డివిజినల్ కార్యదర్శి నాగబాబు, డివిజినల్ ఇసి సభ్యులు సంకు వెంకటేశ్వరరావు, గూడెం యూనియన్ కార్యదర్శి పివి.సూర్యచంద్ర రావు, కోశాధికారి వి.శ్రీనివాస్, ఏజెంట్లు పాల్గొన్నారు.

పాలకొల్లు : ఎల్ఐసి ఏజెంట్లకు ఇచ్చే కమీషన్ తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద సోమవారం ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏజెంట్లకు వచ్చే ప్రయోజనాలను తగ్గించడం దారుణమన్నారు. సమస్యను పరిష్కరించాలని లేకుంటే అమరావతి రైతులు వలే ఎన్ని రోజులైనా సమ్మె చేస్తామని హెచ్చరించారు.

తణుకు : ఎల్ఐసిని నిర్వీర్యం చేసి ప్రయివేటు బీమా కంపెనీలకు లాభం చేకూర్చేందుకు దశల వారీగా కేంద్ర ప్రభుత్వం తన అజెండా అమలు చేస్తోందని ఏజెంట్స్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద ఏజెంట్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు వైవి.శ్రీనివాస్, సలాది ఉదయభాస్కరరావు, సత్తి పాండురంగారెడ్డి, టివికె రంగారెడ్డి మాట్లాడారు. వేతన సవరణ ప్రకారం ఏజెంట్లకు ఇస్తున్న కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారం తగదు

భీమవరం టౌన్ : వెంపలోని ఎస్‌సి పేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపడాన్ని వ్యతిరేకిస్తూ విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల కాపీలను దహనం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని భారాలు తగ్గిస్తామని ఇచ్చిన హామీని విస్మరించడం తగదన్నారు. కార్యక్రమంలో మంద మరియమ్మ, చిలకపాటి శకుంతల, కొండేటి కుమారి, బల్ల శకుంతల, ఇంజేటి మరియమ్మ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - అత్తిలి

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు పంటలు కోల్పోయిన కౌలురైతులు, రైతులకు తక్షణం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా బల్లిపాడు, వరిఘేడు, కొమ్మర, ఈడూరు, తిరుపతిపురం, స్కిన్నెరపురం, కంచుమర్రు తదితర గ్రామాల్లో 14 వందల ఎకరాల్లో పంట దెబ్బతిని 17 వందల మందికి పైగా రైతులు నష్టపోయారన్నారు. పంటనష్టం నిమిత్తం ప్రభుత్వం వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 75 లక్షల రూపాయలు పైబడి రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే ఇటీవల సెప్టెంబరులో నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చినా జులై, ఆగస్టు మొదటి వారంలో పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటనష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలన్నారు. అనంతరం తహశీల్దార్ వంశీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు ఆకుల సత్యనారాయణ, విత్తంశెట్టి సత్యనారాయణ, మంగిన ధర్మారావు, నూకల శ్రీనివాసు, పుప్పాల కొండ పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించాలి: ఎంపిపి

ప్రజాశక్తి - కాళ్ల



మాట్లాడుతున్న ఎంపిపి శిరీషవిశ్వనాధరాజు

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని కాళ్ల ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు అన్నారు. కాళ్ల మండలపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి పెన్మెత్స శిరీషవిశ్వనాథరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎంపిపి పెన్మెత్స శిరీషవిశ్వనాధరాజు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో కొన్ని అభివృద్ధి పనులు నిధుల కొరత కారణంగా నిలిచి ఆలస్యం అయ్యాయి. ప్రస్తుతం నిధులు ఇబ్బందిలేదని, త్వరితగతిన పూర్తి చేసేవిధంగా కాంట్రాక్టర్లకు తెలుపుతున్నామన్నారు. మండలంలో కొత్తగా 9 రేషన్ దుకాణాలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాళ్ల జెడ్‌పిటిసి పర్వుగొళ్ల సోమేశ్వరావు, వైస్ ఎంపిపిలు సరాబు పద్మారాణి, మన్నే నాగలక్ష్మి, సర్పంచిల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, ఎంపిడిఒ జి.స్వాతి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

గణపవరం : జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక డిగ్రీ కాలేజీలో అధ్యాపకులు విద్యార్థులచే ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశ సమగ్రతను కాపాడాలని ఐక్యత, సమగ్రత కోసం విద్యార్థులు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా దేశంకోసం, ఐక్యత, సమగ్రతను, భద్రతను కాపాడుతానని, తనని తాను దేశానికి అంకితం అవుతానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యుడి జీవితం అస్తవ్యస్తం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్

ఆకివీడు : ఒకపక్క ప్రకృతి విపత్తు, మరోపక్క ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి సామాన్యుడి జీవితం అస్తవ్యస్తంగా మారిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ అన్నారు. చినకాపవరం శాఖా మహాసభ సోమవారం గ్రామ నాయకులు గండికోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆయన నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమం ప్రారంభంలో గోపాలం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఇటీవల మరణించిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆర్‌ఎస్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక ధరలు సామాన్యుడి జీవితాన్ని వెన్ను విరుస్తున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం ధరలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలలో కార్యదర్శిగా ఎం.కిసెంజర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.తవిటి నాయుడు, షేక్ వలీ పాల్గొన్నారు.

పిఎంపి జన్నాథరావు సంఘం నుంచి బహిష్కరణ

అసోసియేషన్ నాయకులు వెల్లడి

మొగల్తూరు : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాళీపట్నం గ్రామానికి చెందిన పిఎంపి కటిక రెడ్డి జగన్నాథరావుని తమ సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు మొగల్తూరు పిఎంపి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కెఎస్‌పిఎన్.ముక్తేశ్వరరావు, సిహెచ్ విపి.శ్రీనివాస్ ప్రసాద్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్య చికిత్సలు అందించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పిఎంపి, ఆర్‌ఎంపిలు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ప్రాథమిక వైద్యం అందించాలని వారు సూచించారు.

పోలీసులు సమాజంలో భాగం : డిఎస్‌పి

తాడేపల్లిగూడెం : పోలీస్ కుటుంబం సమాజంలో ముఖ్యమైన భాగమని తాడేపల్లిగూడెం డిఎస్‌పి ధర్మవరపు విశ్వనాథ్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మాగంటి కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి విశ్వనాథ్ మాట్లాడుతూ పోలీసు సేవా కార్యక్రమాల్లో రక్తదాన శిబిరం ఒకటని, పోలీసులు ప్రజలతో నిత్యం ఏదో ఒక రూపంలో మమేకమవుతారన్నారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లకు, విద్యార్థులను, ప్రజలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు రమ్య, పట్టణ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ ఎస్ఐ కె.కొండలరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న ఓ మనిషి ప్రాణం కాపాడినట్లేనని అడిషనల్ ఎస్‌పి ఎన్‌బిఎం.మురళీకృష్ణ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సోమవారం పట్టణంలోని అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని అడిషనల్ ఎస్‌పి మురళీకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేసిన పట్టణ సిఐ బి.యాదగిరి, ఎస్‌ఐలు సిహెచ్.జయలక్ష్మి, ముత్యాలరావు, సిబ్బంది, విద్యార్థులను ఆయన అభినందించారు. నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, రెడ్‌క్రాస్ సిబ్బంది ఎనుముల సతీష్ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయానికి లైసెన్సులు తప్పనిసరి

నరసాపురం : లైసెన్స్ లేకుండా దుకాణాలు వేస్తే కఠినచర్యలు తీసుకుంటామని అదనపు ఎస్‌పి మురళీకృష్ణ హెచ్చరించారు. సోమవారం స్థానిక అల్లూరి కళ్యాణ్ సాంస్కృతిక కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దీపావళి బాణాసంచా విక్రయానికి తాత్కాలిక లైసెన్స్ పెట్టుకున్న వారందరికీ అనుమతులు ఇచ్చామన్నారు. ప్రభుత్వ నిబంధనల్ని పట్టించుకోకుండా ఎవరైనా దుకాణాలు ఏర్పాటు చేస్తే సహించేది లేదన్నారు. ప్రజలు కూడా బాణసంచా కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పట్టణ సిఐ బి.యాదగిరి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలకు చర్యలు తీసుకోవాలి

భీమవరం : జిల్లాలో సామాన్యుడికి ఇసుకను చేరువ చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా ఇసుకపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అందుబాటులో లేదని పొరుగు జిల్లాల నుంచి జిల్లాకు తీసుకువచ్చి స్టాక్ చేసేందుకు అనువైన స్టాక్ పాయింట్లను, ఏజెన్సీలను గుర్తించాలన్నారు. స్టాక్ పాయింట్‌ల వద్ద మినరల్ డీలర్స్ లైసెన్స్‌లను ఏజెన్సీలకు జారీచేసి ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెసి రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జిల్లాస్థాయి అవార్డులు

పాలకొల్లు : స్థానిక శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల పాలకొల్లుకు 3 జిల్లాస్థాయి అవార్డులు వచ్చాయి. ఈ కార్యక్రమాన్ని జిల్లా యువ సర్వీసుల, సెట్వెల్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజన సంబరాలు-2024 ఈనెల 26న తణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో నిర్వహించగా ఈ పోటీల్లో 12 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వారి ప్రతిభను ప్రదర్శించారు. ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ కళాశాలకు చెందిన వి.వెంకట్ సెకండ్ బిఎ విద్యార్థి వక్తృత్వం పోటీలో జిల్లాస్థాయిలో రెండవ స్థానాన్ని, మొదటి సంవత్సరం బిఎస్‌సి చదువుతున్న బి.మహాలక్ష్మి పెయింటింగ్‌లో జిల్లాస్థాయిలో మూడో స్థానాన్ని, జానపద బృంద నృత్యంలో కళాశాల ఆరుగురు విద్యార్థినీలు జిల్లా స్థాయిలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఇతర సభ్యులను అభినందించారు.

అడిషనల్ ఎస్‌పి మురళీకృష్ణ బదిలీ

నరసాపురం : నరసాపురం అడిషనల్ ఎస్‌పి ఎన్‌బిఎం.మురళీకృష్ణ బదిలీ అయ్యారు. నరసాపురం డిఎస్‌పిగా జి.వేదను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోండి

ఉండి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బి.సాయి చంద్ర అన్నారు. సోమవారం ఉండి మండలం కలిసిపూడి గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి మారుమూల పల్లెకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వివరాలు అడిగి తెలుసుకున్న తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి



తాడేపల్లిగూడెం : రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

మండలంలో జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. సోమవారం ఉదయం ప్రత్తిపాడు నుంచి కృష్ణయపాలెం వరకు జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనుల నాణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరమ్మత్తు పనులలో, నిర్మాణ పనులలో నాణ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రోడ్లు వేయకపోగా కనీసం గుంతలను సైతం పూడ్చలేదని, ప్రధాన రహదారులు ఛిద్రమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో పల్లెనల్లి రోడ్లను నిర్మాణంతోపాటు బాగా పాడైన రోడ్లను మరమ్మత్తులు చేస్తున్నట్లుగా వివరించారు. అతి త్వరలోనే అంచలంచెలుగా ప్రతి రోడ్డునూ నూతనంగా నిర్మించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. నియోజకవర్గాల్లోని గ్రామాభివృద్ధి జయంగా ఇప్పటికే రూ.100 కోట్లతో రోడ్లను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాల్సిందిగా ముఖ్యమంత్రిని కలిసి అభ్యర్థించానని, దానికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఆయన ఆశయాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశీ, పాలూరు వెంకటేశ్వరరావు, చెరుకూరి జగత్ సోమశేఖర్, పైబోయిన వెంకట్రామయ్య, గుండుమోగుల సురేష్, చేపల రమేష్, నల్లగంచు రాంబాబు, మట్టా రామకృష్ణ పాల్గొన్నారు.

పెనుమంత్ర : రాష్ట్రంలో సత్వర అభివృద్ధి కూటమి ప్రభుత్వం వల్లనే సాధ్యమని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని మార్టేరు నుంచి పాలకొల్లు వరకూ జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోని రోడ్లను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసే పనికి పూనుకుందని అన్నారు. మార్టేరు సెంటర్ నుంచి 700 మీటర్లు మేర సిమ్మెంట్ రోడ్డు పటిష్టంగా వేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ఆయన వెంట నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం: మండలంలోని సీతారాంపురం సౌత్, రాజుగారితోట గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన సీసీ రహదారులను సోమవారం భీమవరం క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చెందిన ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. రహదారుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన వారిలో క్వాలిటీ కంట్రోల్ డిఇఇ గోవిందరాజు, ఎఇఇ విశ్వనాథం, పంచాయతీ రాజ్ డిఇఇ సత్యనారాయణ ఉన్నారు.

చదరంగం పోటీల్లో ఛాంబర్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

బివి.రాజు డిగ్రీ కళాశాల భీమవరంలో ఈనెల 27న అంతర్ కళాశాలల చదరంగ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో ఛాంబర్స్ కళాశాల విద్యార్థినీలు ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ జి.సుధాకర్ చేతులమీదుగా బహుమతి అందుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. టీమ్ విజేతలు ఎ.గగన, ఎం.ప్రసన్న, ఆర్ఎల్.హర్షిత, ఇఎస్ఎస్.సాత్విక, కెవిఎస్.సూర్య ప్రియ, కళాశాల ఛైర్మన్ కెవి.నరసింహారావు, అకాడమిక్ అడ్వైజర్స్ డాక్టర్ ఎబిఎస్ మూర్తి, ఎన్.సీతారామారావు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, కళాశాల పిడి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు విజేతలను అభినందించారు.

నాలెడ్జ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పెనుగొండ

జాతీయస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్(క్యాట్) మొదటి దశ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షలలో గణితంలో 11 మంది, భౌతిక శాస్త్రంలో 15 మంది, రసాయన శాస్త్రంలో 21 మంది మొత్తం 47 మంది రెండో దశకు అర్హత సాధించారు. వీరిని అభినందిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు పోటీతత్వం పెంచేందుకు తమ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత తగిన శిక్షణ ఇస్తున్నామని తెలియజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఆచంట : ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ, ఆచంట మండలాలకు చెందిన నలుగురు దాతలు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.లక్షా 75 వేల చెక్కులను ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు అందజేశారు. పోడూరు మండలం కొమ్ముచిక్కాల ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పెనుగొండ మండలం పెనుగొండకు చెందిన మోదుకూరి సీతారాం రూ.67,556, దొంగ రావిపాలెంకు చెందిన కోన సీతామహాలక్ష్మి రూ.25 వేలు, వడలి గ్రామానికి చెందిన సూరిశెట్టి నర్సవేణి రూ.16 వేలు, ఆచంటకు చెందిన కోళ్ల చైతన్య నాగు రూ.67,556 నగదు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్, పెనుమంత్ర మండల టిడిపి అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, బిజెపి మహిళా నాయకురాలు బలుసు మాధవీలత, రెడ్డి గుప్తా పాల్గొన్నారు.

జెఎన్‌టియు విశ్వవిద్యాలయం టీమ్‌కు శశి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జెఎన్‌టియు విశ్వవిద్యాలయం నెట్ బాల్ టీంకు స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో రెండవ సంవత్సరం చదువుతున్న యు.యశస్విని ఎంపికైనట్టు కళాశాల యాజమాన్యం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈమె వచ్చే నెలలో సురేష్ జ్ఞాన్ విహార్ యూనివర్సిటీ, జైపూర్‌లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ ఇస్మాయిల్, డీన్ డాక్టర్ సుబ్రమణ్యం, ఫిజికల్ డైరెక్టర్ లెఫ్టినెంట్ పిఎస్.శేఖర్, బి.సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత

మున్సిపల్ కమిషనర్ అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణ పరిధిలో తాగునీటి సరఫరాను అధిక ప్రాధాన్యతగా తీసుకోవాలని, ఎక్కడైనా సాంకేతిక సమస్యల వల్ల పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయలేని సమయాల్లో యుద్ధప్రాతిపదికన మరమత్తులు చేపట్టి, ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం 25వ వార్డు ఆదర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆదర్స్ కాలనీలో పర్యటించిన సమయంలో గత కొన్ని రోజులుగా లైట్స్, తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదన్న స్థానికుల ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని తక్షణమే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యర్రా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆచంట

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న రూ.20 వేల కోట్ల భారాలను తక్షణం రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు అన్నారు. సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి అధ్యక్షతన జరిగింది. బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ భరోసా ఇచ్చి నాలుగు నెలలకే రాష్ట్ర ప్రభుత్వం ఛార్జీలపై మోత మోగిస్తోందని విమర్శించారు. ఇప్పటికే అధిక ధరలతో సతమతమవుతున్న సామాన్యులకు ఇది పెనుభారంగా మారిందన్నారు. తక్షణం ట్రూ అప్ ఛార్జీల భారాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, ఎస్‌విఎన్.శర్మ, కుసుమే జైరాజు, పి.మోహన్‌రావు, మచ్చ సుబ్బారావు పాల్గొన్నారు.

డిఆర్‌ఒగా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా రెవెన్యూ అధికారిగా మొగిలి వెంకటేశ్వర్లు, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒగా ఖతీబ్ కౌసర్ భానో సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. డిఆర్‌ఒగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన మొగిలి వెంకటేశ్వర్లు డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డిఆర్‌ఒగా పనిచేసి బదిలీపై జిల్లాకు విచ్చేశారు. తాడేపల్లిగూడెం ఆర్‌డిఒగా బాధ్యతలు చేపట్టిన ఖతీబ్ కౌసర్ భానో డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం డివిజన్ ఆర్‌డిఒగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో తాడేపల్లిగూడెం డివిజన్‌కు కేటాయించారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలమొక్కలను అందజేశారు.

ప్రతి ఇంటికీ వెళ్లి పశుగణన

ప్రజాశక్తి - ఆచంట

అఖిలభారత 21వ పశుగణన ప్రతి ఇంటికీ వెళ్లి యాప్‌లో పొందుపరచాలని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం పోడూరు మండలం కొమ్ముచిక్కాల కార్యాలయంలో పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 మంది నమోదు చేసేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారని, 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకూ ఈ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. మండలానికి 40 గోకులం షెడ్లు మంజూరు చేయడం జరిగిందని, త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని కోరారు. పెనుగొండ, పోడూరు మండలకేంద్రాల్లో పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయని, వాటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ ఎడిఎ పి.జయాకర్ జాన్సన్ కోరారు. పెనుగొండలో పశువైద్యశాల భవనం ఇన్ కంప్లీట్‌లో ఉందని, పోడూరు భవనానికి నిధులు మంజూరు చేయాలని ప్రమీల రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోడూరు పశుసంవర్ధక శాఖ ఎడిఎ పి.జయకర్ జాన్సన్, పశు సంవర్ధక శాఖ ఎడిఎ, పెనుగొండ డాక్టర్ ఎం.ప్రమీల రాణి, ఆలమూరు పశువైద్యులు డాక్టర్ జి.రవికాంత్, ఆచంట పశువైద్యాధికారి ఎల్.ఫణికుమార్, జున్నూరు పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.మహేష్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదులో ముందుండాలి

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడిపి సభ్యత్వ నమోదులో జిల్లా రాష్ట్రంలోనే నెంబర్-1గా నిలవాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జగన్ ఐదేళ్ల రాక్షస, నిరంకుశ పాలనలో ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారని, 65 ఏళ్ల వయసులో చంద్రబాబు నాయుడును అక్రమంగా జైల్లో పెట్టి మౌలిక సదుపాయాలు లేకుండా, కనీసం ఫ్యాన్ లేకుండా చేశారని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గం కార్యకర్తల సమావేశం స్థానిక ఎస్ కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడి ఎన్‌డియే ప్రభుత్వంకు 175కి 164 సీట్లు ఇచ్చి, 70 శాతం ఓట్లు ఇచ్చి, రాష్ట్ర ప్రజలు గొప్ప తీర్పు ఇచ్చారని చెప్పారు. కనీసం జగన్‌కు ప్రతి పక్ష హోదా ఇవ్వకుండా కేవలం 11 సీట్లకే పరిమితం చేసిన ప్రజలు రికార్డు స్థాయిలో చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గ టిడిపి సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలని కోరారు. కేవలం రూ.100 2 సంవత్సరాల పరిధి సభ్యత్వ నమోదులో ప్రమాద బీమా రూ.5 లక్షలు, మట్టి ఖర్చులు రూ.10 వేలు అందించే ఏకైక పార్టీ టిడిపి అన్నారు. రాష్ట్రంలో కీలక శాఖ అయిన జలవనరుల శాఖను నిమ్మల రామానాయుడు చక్కగా నిర్వహిస్తూ మంచిపేరు తెచ్చారని జిల్లా టిడిపి అధ్యక్షుడు మంతెన రామరాజు చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో అర్హత ఉన్నవారు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, మామిడిశెట్టి పెద్దిరాజు, కర్నేని గౌరు నాయుడు, రోజా రమణి మాట్లాడారు.

ఘనంగా కుటుంబరావు జయంతి

తణుకు : సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక బ్యాంక్ కాలనీ, స్వాతంత్ర సమరయోధుల పార్కు ప్రాంగణమందు ప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ సాహితీ తపస్వి, అక్షర నిరంతర సాధకుడు కుటుంబరావు అన్నారు. విశ్రాంత టెలికాం జనరల్ మేనేజర్ కొవ్వలి ఆంజనేయశర్మ మాట్లాడుతూ సాహితీవేత్త కొడవటిగంటి కుటుంబరావుగా సుపరిచితుడు అన్నారు. అనంతరం కుటుంబరావుతో పరిచయం ఉన్న విశ్రాంత జాయింట్ జనరల్ మేనేజర్, ఢిల్లీ కొవ్వలి ఆంజనేయశర్మను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌరు వెంకటేశ్వర్లు, పొట్ల సురేష్, పి.శివన్నారాయణ, కోడూరి ఆంజనేయులు, ఆలపాటి సుబ్బారావు, సత్తి రాజారెడ్డి, బివిఆర్‌కె.ప్రసాద్, పి.దక్షిణామూర్తి, విఎస్.శివకుమార్, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, పి.మురళీకుమార్, ఎ.కాశీవిశ్వనాథం, జి.శ్రీని వాసరాజు, బెల్లంకొండ బుచ్చిబాబు, అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా ప్రజలందరూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామంలో సోమవారం ఆయన పలు అభివృద్ధి పనులలో భాగంగా దర్శిపర్రు గ్రామంలో సచివాలయాన్ని ప్రారంభించి మొక్కలను నాటారు. అనంతరం రూ.10 లక్షల మంచినీటి ఫిల్టర్ బెడ్లు, జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో జాతీయ నాయకుల విగ్రహాల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కానున్న దాతలందరికీ పూర్తి గౌరవం ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటున్నట్లుగా చెప్పారు. పెంటపాడు మండల అధ్యక్షులు పుల్లా బాబి, వర్తనపల్లి కాశి, పాలూరు వెంకటేశ్వరరావు, సర్పంచి కోలా శేషవేణి, ఉపసర్పంచి కోలా మార్కండేయులు, వార్డు మెంబర్లు, జనసైనికులు, వీరమహిళలు, నాయకులు, కార్యకర్తలు, ఎంపిటిసి తోట నిరీక్షణరావు, పంచాయతీ, సచివాలయ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

తణుకు రూరల్ : యనమదుర్రు డ్రైయిన్‌లో అధికంగా పెరిగిన తూడు, పిచ్చిమొక్కలు తొలగించే పనులు ఉపాధి కూలీలతో చేయించి, ఉపాధి కూలీలకు పని కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దువ్వ గ్రామ ఉపాధి కూలీలు సోమవారం తహశీల్దార్ డివిఎస్ఎస్ అశోక్ వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి ఏటా కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని చట్టం చెబుతున్నప్పటికీ అధికారులు పని కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. ఉపాధి కూలీలు పని కల్పించాలని కోరినా పనులు లేవని అధికారులు జవాబివ్వడం సబబుకాదన్నారు. ప్రతిఏటా అధిక వర్షాల కారణంగా దువ్వ పరిధిలో ఉన్న యనమదుర్రు డ్రెయిన్ కారణంగా సుమారుగా 1200 ఎకరాల పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయని గుర్తించాలన్నారు. అందుచేత దువ్వ గ్రామాన్ని ముంపు నుంచి కాపాడేందుకు యనమదుర్రు డ్రెయిన్‌లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని, పూడిక తీసి గట్టు బలహీనంగా ఉన్న చోట గట్టు పటిష్టపరిచే పనులు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దొంగల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు బండారు వెంకటేశ్వరరావు, తూము దానయ్య, గడుపు సూర్యనారాయణ, ఎలుబూడి ప్రసాద్ పాల్గొన్నారు.

డిఆర్‌ఒ ఉదయభాస్కర్‌రావు అభినందనీయులు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికలు, వరదల సమయంలో జిల్లా యంత్రాంగాన్ని సమన్వయంతో నడిపించిన డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు అభినందనీయులని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నెల్లూరు జిల్లాకు డిఆర్‌ఒగా బదిలీపై వెళ్తున్న డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావును కలెక్టర్ నాగరాణి, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా డిఆర్‌ఒగా వచ్చి కొద్ది నెలలు అయిన ఎన్నికల పనులు, జిల్లాల వరదలు, విజయవాడ వరదలకు సహాయ కార్యక్రమాల సమన్వయంలో సంవర్ధవంతంగా పనిచేశారన్నారు. బదిలీపై వెళ్లిన నెల్లూరు జిల్లాలో కూడా మంచి సేవలు అందించి గుర్తింపు పొందాలని కోరారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి హెచ్.నరేష్ చంద్రశేఖర్, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం : ఎస్‌పి

భీమవరం టౌన్ : ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు దారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వారి సమస్యలను స్వయంగా ఎస్‌పికి విన్నవించుకుని, రాతపూర్వకమైన అర్జీలను అందజేశారు. పలు సమస్యలపై 14 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను విన్నవించుకున్నారు. జిల్లా అదనపు ఎస్‌పి(అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు పాల్గొన్నారు.

నరసాపురం : ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అధికారులను ఆదేశించారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 28 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఆర్‌డిఒ వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఉపయోగించుకోవాలి

గణపవరం : ప్రజాసమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఉపయోగించుకోవాలని తహశీల్దార్ అప్పారావు కోరారు. ప్రభుత్వం ప్రతి సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులు హాజరవుతారన్నారు. ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో అధికారులు సాయంత్రం వరకు ఉండి వెళ్లిపోయారని తెలిపారు.

బాస్కెట్ బాల్ విజేత కృష్ణా జిల్లా జట్టు

పెనుమంత్ర : మార్టేరులో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల అండర్-17 బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో సోమవారం జరిగిన ఫైనల్స్‌లో బాలికల విభాగంలో కృష్ణా జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో అనంతపురం జట్టుపై 8-42 పాయింట్స్ స్కోర్ సాధించి కృష్ణా జిల్లా విన్నర్ కాగా, అనంతపురం జట్టు రన్నర్‌గా నిలిచింది. మూడవ స్థానంలో తూర్పుగోదావరి, నాల్గవ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు నిలిచాయని టోర్నమెంట్ ఆర్గనైజర్ పీడీ కర్రి కృష్ణారెడ్డి తెలిపారు. సాయంత్రం బాలుర ఫైనల్స్ జరుగుతున్నాయని ఆయన అన్నారు.

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా తాతారావు

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఎం.తాతారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు సరైన వైద్య సదుపాయాలు అందిస్తానని, సిబ్బంది సహాయ సహకారాలతో ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడతానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు.

29, 30 తేదీల్లో గ్రామసభలు

మొగల్తూరు : మండలంలోని కొత్తపాలెం, శేరేపాలెం గ్రామాల్లో రీ సర్వే గ్రామసభలు నిర్వహించనున్నామని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. ఈనెల 29వ తేదీన కొత్తపాలెం, 30వ తేదీన శేరేపాలెం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించనున్నామన్నారు. భూములకు సంబంధించి సమస్యలు ఉన్న రైతులు ఆయా గ్రామసభల్లో వినతులు అందించాలని ఆయన సూచించారు.

సిద్ధాంతిపై కేసు

మొగల్తూరు : సమస్యలు పరిష్కరిస్తామని రూ.37.50 లక్షల నగదు వసూలకి పాల్పడిన సిద్ధాంతిపై సోమవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెనుమంత్ర మండలం మల్లిపూడి గ్రామానికి చెందిన పెచ్చెట్టి గోపాలకృష్ణకు కుక్కల శ్రీను అనే వ్యక్తి ద్వారా మొగల్తూరుకు చెందిన సిద్ధాంతి అముదాలపల్లి వెంకటాచార్యులు పరిచయం అయ్యాడు. ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తారని శ్రీను చెప్పడంతో గోపాలకృష్ణ సిద్ధాంతిని కలిసి తన సమస్యలు తెలపడంతో సిద్ధాంతి మూడు రోజుల పాటు హోమం చేయాలి, మొగల్తూరులోని మా ఇంటిలోనే హోమం చేస్తానని, నీవు రావాలని సూచించాడు. గోపాలకృష్ణ సిద్ధాంతి ఇంటికి వెళ్లగా నిర్బంధించాడన్నారు. దీనికి సంబంధించి దఫదఫాలుగా రూ.37.50 లక్షలు వసూలు చేశాడని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



నా మేనకోడలు భారతి మా కుటుంబ సహకారి

పెద్ద మేనమామ దయానందరాజు

నా మేనకోడలు భారతి తన కుటుంబాన్ని ఏవిధంగానైతే చూసుకుంటుందో మా కుటుంబాన్ని కూడా అదేవిధంగా చూసుకుంటుంది. మా కుటుంబంలో ఏ కార్యక్రమం జరిగినా భారతి ముందుండి నడిపిస్తుంటుంది. ఆ విధంగానే భారతి స్కూల్లో కూడా అంతే అన్నిట్లోనూ ముందుండి నడిపిస్తుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే భారతి మా కుటుంబ సహకారి. పిల్లలను భారతి బాగా చూసుకుంటుంది. భారతి కుమారుడు రాజేష్ పాలిటిక్స్ చేసిన తర్వాత బందర్లో బిటెక్ చేసి ఉన్నత చదువు చదివి, మంచి పోస్టులో స్థిరపడ్డాడు. వాడి చెల్లి గాయత్రి కూడా బాగా చదివింది. పిల్లలను పెంచడంలో భారతి ఎంతో సక్సెస్ అయ్యింది.



మా అమ్మ ప్రోత్సాహం మరువలేను

భారతి కుమారుడు రాజేష్

అమ్మా నాన్న ఇద్దరూ ఉద్యోగులు కావడంతో నేను ఎక్కువగా పాలకొల్లులో ఉండి చదువుకున్నాను. మా అమ్మ ఉపాధ్యాయురాలు కావడంతో చదువు మీద ఏకాగ్రతతో పెంచారు. మా అమ్మకు వర్కింగ్ మైండ్ ఎక్కువ. చిన్నప్పటి నుంచి నాతో, మా చెల్లితో కాంపిటీషన్ పరీక్షలు రాయించేవారు. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. పోటీ పరీక్షలు రాయడం వల్ల నా చదువుకు, ఉద్యోగాలకు ఎంతో ఉపయోగపడింది. బిటెక్ చేసిన తర్వాత మాస్టర్స్ చేయాలనే ఆలోచన ఉంది. అప్పటికే పరీక్ష కూడా రాశాను. అయితే డబ్బు కోసం ఆలోచించి ఆగిపోదాం అనుకున్నాను. అనుకోకుండా హైదరాబాద్‌లో ట్రిపుల్ ఐటీ వచ్చింది. మా అమ్మ డబ్బు కోసం ఏమి ఆలోచించొద్దు అని భరోసా కల్పించింది. తర్వాత క్యాంపస్ ఇంటర్వ్యూలో టాప్ ప్లేస్‌లో సెలెక్ట్ అయ్యాను. ప్రస్తుతం గూగుల్‌లో వర్క్ చేస్తున్నాను. మా అమ్మ నా చదువులో, ఉద్యోగంలో, నా జీవితంలో అందించిన ప్రోత్సాహం ఎంత చెప్పినా తక్కువే.




ఉత్తమ విద్యాబోధన అభినందనీయం

ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బి.గోపీమూర్తి

భారతి వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. విద్యార్థుల కుటుంబాల ఆర్థిక పరిస్థితి తెలుసుకుని, విద్యార్థుల మానసిక స్థితికి అనుగుణంగా విద్యను బోధించడంలో ఆమె దిట్ట. మండలంలో యుటిఎఫ్ అభివృద్ధికి, జిల్లా కమిటీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఎంఎల్‌సి ఎన్నికలు, యుటిఎఫ్ కార్యక్రమాలకు విరాళాలు అందించి ఆమె దాతృత్వం చాటుకునేవారు. ఉపాధ్యాయ జీవితంలో విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి, సమాజానికి భారతి అందించిన సేవలు ఎనలేనివి.

భారతితో నా జీవనయానం చిరస్మరణీయం

ఎదుటి వారికి సాయపడే గుణం ఎక్కువ - భర్త గొట్టుముక్కల రామభద్రరాజు



భారతితో జీవితం పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. భారతి ఒకపక్క ఉపాధ్యాయినిగా పనిచేస్తూనే మరోపక్క పిల్లలను చూసుకుంటూ కుటుంబ అభివృద్ధిలో భాగస్వామురాలైంది. అటు పాఠశాలలో బోధన, ఇంటికొచ్చిన తర్వాత ఇంటి పనులతో క్షణం తీరిక లేకుండా జీవితం సాగించింది. ఆమె అందించిన సేవలు ఎంత చెప్పినా తక్కువే. భారతితో నా జీవిత ప్రయాణం మరువలేనిది. ఎటువంటి మనస్పర్ధలూ లేకుండా ముందుకు సాగాము. ఏనాడూ వెనుకకు తిరిగి చూడలేదు. ఎదుటివారికి సాయం చేసే గుణం భారతికి చాలా ఎక్కువ. ఎవరైనా ఆపదలో ఉన్నారంటే వాళ్లకు ఎంతోకొంత ఆర్థిక సహకారం చేయడం ఆమె గొప్పతనం. వివిధ సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలకు, వివిధ కార్యక్రమాలకు సైతం విరాళాలు అందిస్తుంటుంది. మన దగ్గర ఉన్నాయో.. లేదో చూసుకుని ఇవ్వాలి కదా అని నేనన్నా.. పర్లేదండి.. ఇచ్చేయండి తర్వాత చూసుకుందాం అంటుందే తప్ప, వచ్చిన వారిని ఉత్తి చేతులతో పంపించిన సందర్భం ఇప్పటి వరకు లేదు. మాకు ఉన్న దానిలో ఎదుటి వారికి సాయపడటం మా ఇద్దరికీ ఎంతో తృప్తినిస్తుంది.

కార్మిక నేతగా రామభద్రరాజు

పాలకోడేరుకు చెందిన గొట్టుముక్కల బుచ్చిరాజు, వెంకటసుబ్బమ్మ దంపతుల కుమారుడు రామభద్రరాజు. వీరిది వ్యవసాయ కుటుంబం. రామభద్రరాజు చిన్నతనంలో వారి తల్లిదండ్రులు కృష్ణా జిల్లా పోతుమర్రులో వ్యవసాయం చేసేవారు. ఐటిఐ చదివిన రామభద్రరాజు వేంద్ర డెల్టా పేపర్ మిల్లులో 1984లో సీనియర్ ఫిట్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సుమారు 40 ఏళ్లు పని చేశారు. ఎఐటియుసి నాయకునిగా మూడేళ్లు పని చేసిన రామభద్రరాజు తర్వాత 1989లో సిఐటియులో చేరారు. సిఐటియు నేతగా జాయింట్ సెక్రటరీగా, ట్రెజరర్‌గా సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. కార్మికులకు జీతాలు, అగ్రిమెంట్లు, ప్రమోషన్లు వంటి సమస్యలపై పోరాటాల్లో అండగా నిలబడ్డారు. లోన్లు, పెండింగ్ సమస్యలపై జరిగిన ఆందోళనల్లో రామభద్రరాజుతోపాటు మరికొంతమంది కార్మికులను మూడు నెలలపాటు మిల్లుకు రాకుండా యాజమాన్యం అడ్డుకుంది. దీంతో సిపిఎం సీనియర్ నేత, కీర్తిశేషులు రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) అధికారులు, మిల్లు యాజమాన్యంతో మాట్లాడి సమస్యను చక్కదిద్దడంతో కార్మికులను తిరిగి పనిలో పెట్టుకున్నారు.కార్మికులకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారానికి రామభద్రరాజు కృషి మరువలేనిది.





ప్రజాశక్తి
ఉపాధ్యాయిని వేగేశ్న భారతి ఉద్యోగ విరమణ ప్రత్యేక అనుబంధం
పశ్చిమగోదావరి జిల్లా
29, అక్టోబర్ 2024
Advt.feature



- ఉపాధ్యాయినిగా పాలకోడేరుకు చెందిన వేగేశ్న భారతి ఎనలేని సేవలు
- 41 ఏళ్లుగా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు
- భారతి కుటుంబ సభ్యులంతా ఉపాధ్యాయులే
- పుట్టింది చింతపర్రు.. మెట్టినిల్లు పాలకోడేరుతో ఎనలేని అనుబంధం
- పాఠశాల భివృద్ధికి.. విద్యార్థుల ఉన్నతికి నిరంతరం కృషి
- సమాజం పట్ల అవగాహన.. సామాజిక స్పృహతో ముందుకు

భావితరాల దిక్సూచి.. భారతి

వృత్తిరీత్యా ఆమె ఒక సాధారణ ఉపాధ్యాయిని. అయితే ఆమె ఆలోచనా విధానం నారీమణులకు మణిహారం. పాఠ్యాంశాల బోధనతోనే ఆగకుండా విద్యాభివృద్ధికి సహకారం అందిస్తూ విద్యార్థుల ఉన్నతికి ఆర్థికంగా తోడ్పడి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేశారు. అక్కడితో ఆగిపోకుండా ఉపాధ్యాయుల సమస్యలు, సామాజిక అంశాలతోపాటు సమాజానికి ఏదో చేయాలనే భావన మదిలో నిలువెల్లా నింపుకున్నారు. సమాజం పట్ల అవగాహన, సామాజిక స్పృహ, బాధ్యత గల వ్యక్తిత్వం ఆమె సొంతం. ఆమె మరెవరో కాదు పాలకోడేరు గ్రామానికి చెందిన వేగేశ్న భారతి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ (స్కూల్ అసిస్టెంట్) ఉపాధ్యాయినిగా పని చేస్తున్న భారతి అంటే విద్యార్థులకు భయం.. విద్యార్థుల తల్లిదండ్రులకు మమకారం. తోటి ఉపాధ్యాయులకు డిక్టేటర్‌గా కన్పిస్తారు. అయితే చదువు విషయంలో రాజీ పడకుండా విద్యార్థులకు విద్యా ఫలాలు పూర్తిస్థాయిలో అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయడంతో ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రయివేటు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారంటే ఆమె చలవే. 41 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వాటిని చిరునవ్వుతో స్వీకరించి అనుకున్న లక్ష్యానికి చేరువైన ఆమెను మా మంచి టీచర్ భారతి అంటుంటారు. ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా భారతి తన జీవిత ప్రస్థాన విశేషాలను ప్రజాశక్తితో పంచుకున్నారు.

భారతి కుటుంబ నేపథ్యం

పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామానికి చెందిన వేగేశ్న నరసింహరాజు, ఝాన్సీలక్ష్మీబాయి దంపతులకు భారతి 1962 అక్టోబర్ 20వ తేదీన జన్మించారు. ఆమెకు అన్నయ్య రామరాజు, తమ్ముడు శ్రీనివాసరాజు ఉన్నారు. తండ్రి నరసింహరాజు ఉపాధ్యాయునిగా పని చేయగా తల్లి లక్ష్మీబాయి గృహిణి. నరసింహరాజు కుమారులు, కుమార్తెను విద్యలో చక్కటి మార్గంలో తీర్చిదిద్దారు. వారు కూడా విద్యలో ముందు వరసలో ఉంటూ అందొచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముగ్గురూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కొలువులు సాధించడం విశేషం. రామరాజు రిటైర్ అవ్వగా శ్రీనివాసరాజు ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు.

విద్యాభ్యాసం

భారతి ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకూ చింతపర్రు యుపి స్కూల్లో, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ పాలకొల్లు మున్సిపల్ హైస్కూల్లో విద్య అభ్యసించారు. ఇంటర్ పాలకొల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివారు. అనంతరం టిటిసి శిక్షణ పొందారు. భారతి ప్రాథమిక విద్య, కళాశాల విద్య ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే సాగింది. కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే స్తోమత ఉన్నప్పటికీ తమ కుటుంబ సభ్యులంతా ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడం, ప్రభుత్వ విద్య గొప్పతనాన్ని అందరికీ తెలియజేయాలనే ముఖ్యోద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యభ్యసించారు. అయితే భారతి విద్యాభ్యాసం ఏడో తరగతి వరకూ తాతయ్య పెన్మెత్స మా్రాజు, అమ్మమ్మ వెంకటసుబ్బమ్మ ఇంటి వద్దే సాగింది. భారతికి అమ్మమ్మ, తాతయ్య అంటే ఎనలేని ఇష్టం. అయితే మా్రాజు ఆ గ్రామానికి సర్పంచిగా, వైద్యునిగా పని చేశారు. 1975లో భారతి ఏడో తరగతి చదువుతున్న సమయంలో 25 మార్కులకు 24 మార్కులు వచ్చాయి. దీంతో సర్పంచిగా ఉన్న మా్రాజు నేరుగా పాఠశాలకు వెళ్లి 'నీకు చెప్పడం రాలేదా.. మా మనవరాలికి చదవడం రాలేదా' అని ఉపాధ్యాయున్ని ప్రశ్నించడంతో అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులంతా ఒక్కసారిగా కంగుతిన్నారని భారతి ..2లో



భావితరాల దిక్సూచి.. భారతి

(మొదటి పేజీ నుంచి)

చెబుతుంటారు.

రామభద్రరాజుతో వివాహం

ఇంటర్ విద్య పూర్తయిన తర్వాత భారతి కుటుంబంలో విషాద ఘటన చోటుచేసుకుంది. చింతపర్రు సర్పంచిగా పని చేసిన భారతి తాతయ్య పెన్మెత్స మాత్రాజు 1980 ఆగస్టులో ఆకస్మికంగా మృతి చెందారు. సెప్టెంబర్లో భారతికి టిటిసిలో సీటు వచ్చింది. శిక్షణ తీసుకుంటున్నప్పుడే మండల కేంద్రమైన పాలకోడేరుకు చెందిన గొట్టుముక్కల వెంకట బుజ్జిరాజు, వెంకట సుబ్బమ్మ దంపతుల కుమారుడు రామభద్రరాజుతో 1981 మే 21న వివాహమైంది. భారతి తర్వాత టిటిసి శిక్షణ పూర్తిచేసి 1983 సెప్టెంబర్ 1న ఎస్జిటి ఉపాధ్యాయినిగా కొలువు సాధించారు. భారతి దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు రాజేష్, కుమార్తె గాయత్రి. రాజేష్ ఎంటెక్ చేసి బెంగళూరులో గూగుల్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా కోడలు రమాదేవి ఎంఎస్సి కంప్యూటర్స్ గోల్డ్ మెడలిస్ట్. కుమార్తె గాయత్రి కూడా ఎంసిఏ చేశారు. అల్లుడు జగదీష్ ఎంటెక్ చేసి బెంగళూరులో మైక్రోసాఫ్ట్లో ఉద్యోగం చేస్తున్నారు.

ఉపాధ్యాయినిగా 41 ఏళ్ల 2 నెలల సేవలు

1983 సెప్టెంబర్ 1న తొలిసారి భారతి ఉపాధ్యాయినిగా పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్గా బాధ్యతలు చేపట్టారు. అక్కడ రెండేళ్ల పని చేశాక 1985లో లంకలకోడేరు ప్రాథమిక పాఠశాలలో, తర్వాత శృంగవృక్షం చినపేట స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో పని చేశారు. 1987లో పాలకోడేరు చినపేట ప్రాథమిక పాఠశాలలో నాలుగేళ్లపాటు పనిచేసిన తర్వాత పాలకోడేరు నంబర్ వన్ ప్రాథమిక పాఠశాలలో 11 ఏళ్ళు, పాలకోడేరు పెదపేట ప్రాథమిక పాఠశాలలో ఏడేళ్ళ పాటు పని చేశారు. తర్వాత మోగల్లు హైస్కూల్లో అదనపు పోస్ట్లో పని చేశారు. 2009 జనవరి 31న స్కూల్ అసిస్టెంట్గా ప్రమోషన్ పొందారు. తర్వాత మోగల్లు, వేండ్ర, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహించారు. అనంతరం పాలకోడేరు జెడ్పి హైస్కూల్లో 16 ఏళ్లపాటు పని చేశారు. భారతి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 41 ఏళ్ల రెండు నెలలపాటు ఉపాధ్యాయినిగా సేవలందించి అందరి మన్ననలు పొందారు.

పాలకోడేరుతో ఎనలేని అనుబంధం

భారతి పుట్టినిల్లు చింతపర్రు.. మెట్టినిల్లు పాలకోడేరుతో ఎనలేని అనుబంధం ఉంది. 41 ఏళ్ల రెండు నెలలు ఉపాధ్యాయురాలిగా పని చేస్తే 30 ఏళ్లపాటు పాలకోడేరులోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం విశేషం. గ్రామంలో వివిధ పాఠశాలల్లో పని చేసిన భారతిని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు సొంత మనిషిలా భావిస్తారు. విద్యార్థులకు అన్నివిధాలా సహకారం అందించడంతోపాటు వారి తల్లిదండ్రులకు అనేక సూచనలు, సలహాలు అందిస్తూ భారతి వారితో మమేకమయ్యారు. దీంతో వాళ్లకు ఏ సమస్య వచ్చినా ఆమె వద్దకొచ్చి చెబుతుండటం విశేషం. దీంతో భారతికి పాలకోడేరుతో విడదీయలేని ఆత్మీయ బంధం పెనవేసుకుపోయింది.

ఆ కుటుంబ సభ్యులంతా ఉపాధ్యాయులే

భారతి కుటుంబ సభ్యులంతా ఉపాధ్యాయులే. వాళ్ల తాతయ్య దగ్గర నుంచి తండ్రి వరకూ ఉపాధ్యాయులుగా పని చేశారు. భారతి తండ్రి నరసింహరాజు, పెదనాన్న సత్యనారాయణరాజు, మేనమామలు దయానందరాజు, సోమరాజు, అన్నయ్య రామరాజు, తమ్ముడు శ్రీనివాసరాజు, పెద్ద తాతయ్యలు సత్యనారాయణరాజు, లక్ష్మీపతిరాజు, వియ్యంకులు నడింపల్లి రంగరాజు, పేరిచర్ల సీతారామరాజు ఇలా కుటుంబ సభ్యులందరూ విద్యాభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాటలు వేసే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారే. మేనమామలు దయానందరాజు, సోమరాజు ప్రధానోపాధ్యాయులుగా పని చేసి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు స్వీకరించారు.

అనుకోకుండా ఉపాధ్యాయురాలిగా

భారతికి చదువు అంటే ఎంతో మక్కువ. ఏ సబ్జెక్టులోనైనా క్లాస్ ఫస్ట్ ఉండాలనే లక్ష్యంతో చదివేవారు. ఆ విధంగానే క్లాస్ ఫస్ట్లో నిలిచేవారు. లెక్కలు సబ్జెక్టు అంటే భారతికి ఎంతో ఇష్టం. ప్రతి తరగతిలో వందకు వంద మార్కులు లెక్కల సబ్జెక్టులో సాధించేవారు. అయితే భారతి కుటుంబ సభ్యులు మాత్రం ఇంటర్మీడియట్లో సిఇసి గ్రూపులో జాయిన్ చేశారు. దీంతో అప్పటి గణితం ఉపాధ్యాయులు పురాణం శ్రీనివాసరావు, గోనాల సుబ్బారావు గణితం సబ్జెక్ట్ అంటే భారతికి ఇష్టం కదా మీరేంటీ సిఇసిలో జాయిన్ చేశారని కుటుంబ సభ్యులను అడిగితే ఆడపిల్లలకు పెళ్లి చేసేస్తాం కదా అని చెప్పారు. అయితే ఇంటర్ పూర్తయిన తర్వాత భారతి డిగ్రీ చదవాలని అనుకున్నారు. అయితే వాళ్ల నాన్న, మేనమామ టిటిసి శిక్షణకు శ్రీకాకుళం జిల్లా ఓమరవల్లి తీసుకెళ్లారు. అప్పట్లో రూ.60 స్టయిఫండ్ తీసుకుని ఏడాదిపాటు టిటిసి శిక్షణ పొందారు. తర్వాత ఉపాధ్యాయురాలిగా ఒక ఇంటర్వ్యూకు భారతి నాన్న, మేనమామ తీసుకెళ్లగా లోపలికి వెళ్లాక ఏం చెబుతావని భారతిని వాళ్లు అడగ్గా నన్ను బలవంతంగా తీసుకొచ్చారని చెబుతాను అని భారతి బదులిచ్చారట. అలా చెప్పకూడదని ఉద్యోగం వస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని భారతికి నచ్చజెప్పి ఇంటర్వ్యూకి పంపించారు. భారతి కుటుంబ సభ్యులు కూడా అంతా ఉపాధ్యాయులు కావడంతో ఆరు నెలలు ముందుగానే సిలబస్ భారతికి బోధించడంతో ఉద్యోగానికి సహకారమైంది. ఈ విధంగా భారతి అనుకోకుండా ఉపాధ్యాయురాలయ్యారు. భారతికి గణితం ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సుబ్బారావు, హిందీ ఉపాధ్యాయులు శ్రావణరావు అంటే ఎంతో అభిమానం. ఉపాధ్యాయ వృత్తి చేపట్టేందుకు కుటుంబ సభ్యుల సహకారంతోపాటు ఈ ముగ్గురు ఉపాధ్యాయులు ఎంతో సహకరించారు.

భారతి దాతృత్వం ఎనలేనిది

విద్యారంగం అభివృద్ధికి విద్యార్థుల ఉన్నతితో పాటు వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల పట్ల భారతి చాటుకున్న దాతృత్వం ఎనలేనిది. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా విద్యలో వారికి ఆర్థిక తోడ్పాటు అందించడంలో ఆమెకు ఆమె సాటి అని చెప్పొచ్చు. గ్రామానికి చెందిన ఎంతోమంది విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించారు. సాఫ్ట్వేర్లు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులతోపాటు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లోని ఉద్యోగాల్లో స్థిరపడ్డారంటే వారిని తీర్చిదిద్దిన ఘనత భారతికే దక్కుతుంది. అలాగే పదో తరగతి విద్యార్థులకు ఏటా సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్ కూడా అందించేవారు. పాఠ్యపుస్తకాలు, నోట్స్లు ఇలా విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించారు. పాలకోడేరు జెడ్పి హైస్కూల్ అభివృద్ధికి రూ.50 వేలు అందించడమే కాకుండా ఇతర దాతల ద్వారా నిధులు సమీకరించి పాఠశాల అభివృద్ధికి దోహదపడ్డారు. ప్రజా సంఘాలకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు, కళాకారులకు ఆర్థిక తోడ్పాటునందిస్తూ వస్తున్నారు.

యుటిఎఫ్లో ప్రముఖ పాత్ర

భారతి కుటుంబ సభ్యులంతా ఉపాధ్యాయులుగా పని చేయడం, వాళ్లంతా యుటిఎఫ్లో ఉండడంతో భారతి కూడా ఉపాధ్యాయినిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి యుటిఎఫ్లో కొనసాగుతున్నారు. యుటిఎఫ్ మండల బాధ్యతలు దగ్గర నుంచి సంఘం ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమం, నిరసన, ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారు. ప్రస్తుతం యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్గా కొనసాగుతున్నారు.

దేశమంటే ఎంతో గౌరవం

దేశ సరిహద్దుల్లో ఎముకలు కొరికే చలిలో తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా దేశ భద్రత కోసం ప్రాణాలర్పిస్తున్న ఆర్మీ అంటే భారతికి ఎనలేని గౌరవం. ఏటా పాఠశాలలో జరిగే టీచింగ్, లెర్నింగ్ సమావేశంలో జరిగే పవర్ ప్రజెంటేషన్లో ముందుగా ఆర్మీ జవాన్ల ఫొటో లేదా వీడియోగాని చూసి వారందిస్తున్న సేవలను గుర్తు చేసుకుంటున్నారంటే ఆర్మీ పట్ల భారతికి ఉన్న గౌరవ మర్యాదలు ఎటువంటివో అర్థం చేసుకోవచ్చు. ఉద్యోగ విరమణ సందర్భంగా రూ.లక్ష ఆర్మీకి ఫండ్ ఇవ్వాలనుకుని నిశ్చయించుకుని త్వరలో అందించేలా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు.

– ప్రజాశక్తి, పాలకోడేరు

రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధే నా ఆకాంక్ష

వేగేశ్న భారతి, ఉపాధ్యాయురాలు

ఉపాధ్యాయురాలిగా పని చేయడం నాకు దక్కిన మంచి అవకాశం. ఒకవైపు కుటుంబాన్ని, మరోవైపు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో విజయవంతమయ్యాను. 41 ఏళ్లపాటు ఉపాధ్యాయురాలిగా సేవలందించడం నా అదృష్టం. ఎంతోమంది చిన్న పిల్లలు నా దగ్గర చదువుకుని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థితిలో స్థిరపడడంతో నాకు ఎంతో గౌరవాన్ని ఇచ్చింది. ఇప్పటివరకూ ఉపాధ్యాయురాలిగా పాఠాలు బోధించిన నేను ఉద్యోగ విరమణ చేసినప్పటికీ తిరిగి మళ్లీ పాఠశాలకు వెళ్లి పాఠాలు బోధిస్తాను. విద్యార్థులకు ఇంకా పూర్తిస్థాయిలో సిలబస్ పూర్తికాలేదు. సిలబస్ అయ్యేంతవరకూ డిసెంబర్ చివర వరకు పాఠశాలకు వెళ్తాను. తర్వాత భవిష్యత్తుపై పెద్దగా ఆలోచనలేమీ పెట్టుకోలేదు. పిల్లలు కూడా అటువంటివేమీ పెట్టుకోవద్దని చెబుతున్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో ఉన్నాను. సందర్భం ఏదైనా వేదిక మరేదైనా గ్రామాభివృద్ధికి తోడ్పడే అవకాశం లభిస్తే తప్పకుండా వినియోగించుకుని గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఉన్నాను. దీనికి అందరూ సహకరిస్తే గ్రామాభివృద్ధి మరింత త్వరగా సాధ్యపడుతుందనేది నా ఆలోచన. ముఖ్యంగా నా జీవన ప్రస్థానంలో ఉద్యోగ బాధ్యతల్లో నా భర్త రామభద్రరాజు అందించిన సహకారం ఎప్పటికీ మరువలేను.



అమ్మా నాన్న.. ఎప్పుడూ నాకు సపోర్టుగానే ఉంటారు


భారతి కుమార్తె నడింపల్లి గాయత్రి



అమ్మానాన్న ఎప్పుడూ నాకు సపోర్టుగానే ఉండేవారు. మా అమ్మలో నాకు ఎక్కువగా నచ్చేది మా తాతయ్య వాళ్లను, అమ్మమ్మను, తాతాయ్యను చాలా బాగా చూసుకునేది. ఇంటిని ఎలా చక్కపెట్టాలి, ఎలా ప్లాన్ చేసుకోవాలి ఇలా అన్నీ అమ్మ నుంచే నేర్చుకున్నాను. నా చిన్నప్పటి నుంచి అమ్మ ఎంత బిజీగా ఉన్నా ఇంటిని చాలా నీట్గా ఉంచుకునేవారు. మా పిల్లల ఆరోగ్య విషయంలో ఆరోగ్య సూత్రాలు చెబుతుంటారు. ముఖ్యంగా పెద్దవాళ్లను ఎలా గౌరవించాలనేది అమ్మ నుంచే నేర్చుకున్నాను.

సమాజం కోసం ఎక్కువ ఆలోచిస్తారు

భారతి అల్లుడు నడింపల్లి జగదీష్



మా అత్తయ్య విద్య పట్ల ఎంతో శ్రద్ధ వహిస్తారు. విద్యార్థులకు ఏమి చెప్తే అర్థమవుతుంది, ఎలా చెప్తే అర్థమవుతుందని ఆలోచిస్తూనే ఉంటారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఏం చేస్తే బాగుంటుందని తరచూ మమ్మల్ని కూడా అడుగుతుంటారు. ఎక్కువగా సమాజం కోసం ఆలోచిస్తూ ఉంటారు. సమాజంలో ఏర్పడుతున్న సమస్యలు, విద్యారంగంలో అమలవుతున్న వ్యతిరేక విధానాలపై మాట్లాడుతుంటారు. ఈ విషయాలన్నీ నాకు బాగా నచ్చుతాయి.

అత్తయ్య నుంచి ఎంతో నేర్చుకున్నాను

భారతి కోడలు రమాదేవి



అత్తయ్య భారతి అంటే ఎంతో ఇష్టం. ఆమె నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నప్పటికీ కుటుంబాన్ని సమర్థవంతంగా నడిపించారు. ముఖ్యంగా అత్తయ్య దేశ సంస్కృతీ సంప్రదాయాలకు ఎక్కువ ప్రాధాన్యతిస్తారు. అన్ని పండుగలను చాలా సంప్రదాయబద్ధంగా చేస్తారు. అది నాకు చాలా ఆదర్శంగా ఉంటుంది. పండగలను, పద్ధతులను బాగా పాటిస్తారు. అది మా అత్తయ్యలో నాకు బాగా నచ్చుతుంది. ఆమె నుంచి నేను చాలా నేర్చుకున్నాను.

మా నానమ్మ మమ్మల్ని ఎంతో బాగా చూసుకుంటారు

మనవరాలు మోక్షజ



మా నానమ్మ అంటే నాకు ఎంతో ఇష్టం. నన్ను, నాన్నని, అమ్మని, అన్నయ్యని అందరిని ఎంతో బాగా చూసుకుంటారు. నాయనమ్మలో దయ నాకు ఎంతో ఇష్టం. నాయనమ్మకు మొక్కలు, జంతువులు, పక్షులు అంటే ఎంతో ఇష్టం. ఇంట్లో పెంచుకునే జంతువులను, బయట పెరిగే జంతువులను నాయనమ్మ ఒకేలా చూస్తారు.

నాలెడ్జ్ పెంచేందుకు దోహదం

భారతి మనవడు కేదార్ వర్మ



మేము బెంగుళూరులో ఉంటాం. అక్కడే చదువుకుంటున్నాను. ఎప్పుడైనా సెలవులకు పాలకోడేరు వచ్చినప్పుడు నాయనమ్మ పనిచేసే స్కూల్ మొత్తం చూపించేవారు. ఖాళీ సమయంలో నాతో అనేక విషయాలు డిస్కస్ చేసేవారు. ఎలా ఉండాలి.. ఎలా చదువుకోవాలి. ఎలా గౌరవించాలి.. సొసైటీ పట్ల ఎలా ఉండాలి.. ఏ విధంగా సహాయపడాలో చెబుతుంటారు. అనేక అంశాల్లో ఆమె నా నాలెడ్జ్ పెంచేందుకు దోహదపడుతుంటారు.

నాకు నచ్చినవన్నీ కొనిపెడుతుంది

భారతి మనవరాలు నడింపల్లి యోగ్యత



అమ్మమ్మ నన్ను బాగా చూసుకుంటుంది. నాకు నచ్చినవన్నీ కొన్ని పెడుతుంది. అమ్మమ్మకు జంతువులంటే ఇష్టం. వాటిని బాగా చూసుకుంటుంది. అమ్మమ్మ సమయాన్ని బాగా ఫాలో అవుతారు. ఏ విషయంలోనైనా ఆలస్యం చేస్తే అసలు ఊరుకోరు. అన్నీ సమయానికి చేసుకోవాలని చెబుతుంటారు.

ఎడ్యుకేషన్లో డెడికేటెడ్గా, ఫ్యాషన్గా ఉంటారు

భారతి మనవడు నడింపల్లి మహాంత్వర్మ



అమ్మమ్మ ఎడ్యుకేషన్ విషయంలో చాలా డెడికేటెడ్గా, ఫ్యాషన్గా ఉంటారు. ఎలా అంటే నేను అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు స్టూడెంట్స్ హాలిడేస్, వీకెండ్స్లో ఇంటికి వస్తూ ఉంటారు. అప్పుడు మా అమ్మమ్మ స్టూడెంట్స్తో చాలాసేపు కూర్చుని ఎడ్యుకేషన్పై డిస్కషన్ చేస్తుంటారు. స్టూడెంట్స్, టీచింగ్ గురించి ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటారు.

ఆదర్శ ఉపాధ్యాయురాలు భారతి

సేవా కార్యక్రమాలకు భారతి దంపతుల సహకారం అభినందనీయం

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం



భారతి ఆదర్శ ఉపాధ్యాయురాలు. పిల్లలకు మంచి బోధకురాలిగానే కాకుండా సమాజం పట్ల అవగాహన, బాధ్యత గల వ్యక్తి. ఆమె భాగస్వామిగా ఉన్న ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ ఆశయానికి, కర్తవ్యానికి అనుగుణంగా పని చేశారు. ఆమె భర్త జి.రామభద్రరాజు డెల్టా పేపర్ మిల్లు ఉద్యోగిగా, సిఐటియు అనుబంధ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యకర్తగా కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై పని చేశారు. భార్యాభర్తలు ఇరువురూ పలు సందర్భాల్లో సేవా కార్యక్రమాలకు ఆర్థికంగా తోడ్పడుతూ సేవాదృష్టి కలిగి ఉండటం సంతోషకర విషయం. కుమార్తె, కుమారుడిని బాధ్యతతో పెంచి మొత్తం కుటుంబాన్ని చక్కగా తీర్చిదిద్దారు. భారతి తండ్రి నరసింహరాజు ఉపాధ్యాయునిగా పనిచేశారు. తల్లి ఝాన్సీలక్ష్మీబాయి గృహిణి. భారతి తాతయ్య కీర్తిశేషులు పెన్మెత్స మాత్రాజు పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామ సర్పంచిగా సిపిఎం తరపున చాలాకాలం పని చేశారు. నిజాయితీతో పని చేసి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దారు. గ్రామ ప్రజలు, ఇతరుల మన్ననలు ఎంతగానో పొందారు. భారతి అమ్మమ్మ సుబ్బమ్మ, నానమ్మ అచ్చమ్మ కూడా మహిళా సంఘం కార్యకర్తలుగా పని చేశారు. భారతి పెద మేనమామ పెన్మెత్స దయానందరాజు, చిన మేనమామ పెన్మెత్స సోమరాజు ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి జిల్లా ఆదర్శ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందారు. సోమరాజు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షునిగా, గౌరవాధ్యక్షునిగా ఉపాధ్యాయ ఉద్యమ బాధ్యతలు నిర్వహించి ఆదర్శవంతమైన కృషి చేశారు. భారతి వంటి ఉపాధ్యాయిని సమాజానికి అవసరం. దంపతులిద్దరూ భవిష్యత్తులో కూడా సామాజిక స్పృహతో సంఘ సేవా కార్యక్రమాలకు వారి సహకారం కొనసాగించాలని, వారి కుటుంబం ఆనందంగా ఉండాలని ఆకాంక్ష. భారతి, రామభద్రరాజుకు హృదయపూర్వక సామాజిక అభినందనలు తెలియజేస్తున్నాను.